దొంగతనం
వృత్తిగా
పెట్టుకున్న
తను మానవత్వంతో
ఏం చేసాడు?

# వంగర పరమేశ్వర రావు కథ

## ఓ మనిషికథ

నాకు అన్ని వర్గాల ప్రజలతో సంబంధాలున్నాయి. అన్ని వృత్తులవారితో పరిచయమూ వుంది. వాళ్ళతో ఎంతో ఆప్యాయంగా ప్రేమతో మసులుతున్నా వాళ్ళ ప్రభావం నా నడవడిపై ఎలాంటి మార్పునూ కలిగించదు. వాళ్ళెంత దుర్మార్గులైనాసరే!

వాళ్ళ జీవితాల్లోని చీకటి కోణాలన్నింటిని పరిశీలించడం — దానికి ప్రతిస్పందిస్తూ జాలి తలచడం నా వ్యసనం.

మనం మనకోణంనుండి చూస్తుంటే ప్రపంచంలో మనదే సరైన మార్గమని, మిగిలినవాళ్ళంతా అపసవ్యంగా నడుస్తున్నారనే భావం కలుగుతుంది.

కానీ ఎలాంటి పరిస్థితిలో వాళ్ళు అలా నడుచుకున్నారో — వాళ్ళు అలా తయారు కావడానికి పురికొల్పిన కారణాలేమిటి అని సహృదయం, ఓర్పు, సహనాలతో పరిశీలిస్తే వాస్తవం కళ్ళకు గోచరమవుతుంది.

జీవితంలో కోరుకున్నట్లుగా బ్రతికేది వందలో ఒకరు మాత్రమే. మిగతావాళ్ళంతా తమవికాని జీవితాల్ని గడుపుతుంటారనేది నిర్వివాదాంశం.

మానవుడి ప్రతి కదలిక వెనుక ఏదో ఒక బలమైన కారణం తప్పక వుంటుందని నా నమ్మకం.

జీవితంలో ఎలా ప్రవర్తిస్తే తాము లాభం పొందవచ్చో తెలిసీకూడా అలా నడుచుకోలేని వాళ్ళు చాలామంది వుంటారు. నష్టాన్నైనా హాయిగా స్వీకరిస్తారేకానీ — అరిచి గీపెట్టినా తమ నడవడిని మార్చుకోరు.

ఇలాంటికోవకు చెందినవాడే బాబారా



వు. బాబూరావు చాలా మంచి మనిషి నా ఉద్దేశం ప్రకారం.

అతని వృత్తి దొంగతనం. ఈ ఒక్క కారణంతోనే అతను నిరాదరణకు గురైనాడు

మట్టూ ఉన్న జనం అతనిని చీడపురుగులా చీదరించుకుంటారు.

దొంగక్కూడా మానవత్వం వుంటుంది దానిని వెలికి తీసినప్పుడే మన గొప్పతనం.

అతనికీ కన్నీళ్ళుంటాయి... వాటిని తాకినప్పుడే అతని స్థితి అర్థం అవగలదు. ఎంతమంది బాబూరావుని వెలివేసినా అతను నాకు మిత్రుడు అవడంవల్ల చాలామంది నాకు శత్రువులయ్యారు. అయినా నేనతని స్నేహాన్ని వీడలేదు.

బాబూరావుకి ఊహ వచ్చేనాటికి అపహరించబడ్డాడు. కొద్ది వయసొచ్చాక నిజం తెలుసుకున్నాడు. కానీ కన్నవాళ్ళ గురించి ఎలాంటి సమాచారం అతను కనుక్కోలేకపోయాడు.

చిన్నప్పటినుండీ బాబూరావు ఓ దొంగ కుటుంబంలో పెరిగాడు. అతనే బాబూరావుకి తండ్రి, గురువు. తల్లిదండ్రులు తెలియని బాబూరావుకి ఆ దొంగే తండ్రి అయ్యాడు.

పదేళ్ళ వయసు వచ్చేనాటికి చిన్న చిన్న దొంగతనాలలో అందెవేసిన చేయి అయింది బాబూరావుది. దొంగతనం చేయడం ఎంత తప్పో తెలిసేసరికి బాబూరావుకు ప్రజల్లో, పోలీసుల్లో 'దొంగ'గా ముద్రపడింది.

మంచిగా మారాలనుకున్నా చుట్టూ ఉన్న జనం అతనిని దొంగలానే చూడసాగారు.

డబ్బుకి ఆశపడి కొంతమంది పోలీసులు బాబూరావుచేత దొంగతనాలు చేయించి వాటాలు పంచుకున్నారు.

అనేకసార్లు పట్టుబడ్డాడు. ఎన్నోసార్లు జైలుకు వెళ్ళొచ్చాడు. తను చేయని దొంగతనాలకు శిక్షలను అనుభవించాడు. పరిస్థితులు బాబూరావుమరికాస్త క్రూరుడుగా తయారుకావడానికి కారణమయ్యాయి.

అది అతని గురించి నాకు తెలిసిన కథ.

కానీ బాబూరావుని చూస్తే నాకు అతనిలో ఇంకో మనిషి కనిపిస్తాడు. అనేకసార్లు అడిగాను. ఎందుకులేబాబు...! అదంతా ఓ పెద్ద కథ!'' అంటూ మాట దాటేస్తాడే కానీ నిజాన్ని ఎప్పుడూ బయటపెట్టలేదు.

పది రోజుల్నుంచి బాబూరావు కనపడలేదు. 'డ్యూటీ' ఎక్కితే అంతే. లేకుంటే రోజూ సాయంత్రం తప్పనిసరిగా నా దగ్గర కొచ్చేవాడే. .

ఎంత డబ్బు సంపాదించినా పైసా మిగల్చడు. ఒక్కరోజులోనే ఖర్చు చేస్తాడు. ఇష్టం వచ్చినంత తాగుతాడు. ఏ చెట్టు నీడనో నిద్రపోతాడు.

అయితే నెలనెలా రెండొందలు ఓ ఆడమనిషి పేరుమీద మనీయార్డరు పంపిస్తుంటాడు.

ఎన్నోసార్లు అడిగాను.

''నీ కూతురా?''

''నాకెవరూ లేరుబాబూ...'' అని కంట తడిపెట్టుకుని విషయాన్ని దాటేస్తాడేకానీ... అసలు విషయం చెప్పడు.

''ఈ దొంగతనం మానేసి ఏదైనా పనిచేసుకోరాదా?'' అని ఓసారి బాబూరావుని అడిగాను.

''నాకెవరు పని ఇస్తారయ్యా? అయినా ఓసారి మంచిగా మారి బతుకుదామని పనికోసం వెళ్ళానయ్యా. వాళ్ళు చేసిన అన్యాయం చూసి నా కడుపు తరుక్కుపోయింది. మంచి మనిషిగా మారితే నా గతి ఏమిటో అర్థమైందయ్యా'' అన్నాడు.

"ఏం జరిగింది?!" అని ప్రశ్నించాను జరిగిన సంఘటనను వివరించాడు.

* * *

"అయ్యా దండాలయ్యా! ఏదన్నా పనుంటే ఇప్పించండి"

ప్రాధేయపడుతూ ఆ ఊరి కామందు నాఘభూషణాన్ని అడిగాడు.

"ఏరా! బాబుగా! దొంగతనం చేసేవాడివి పనితో నీకేంపనిరా?" అన్నాడు ఆశ్చర్యంగా.

"మంచిగామారి... మామూలుగా బతుకుదామనుకుంటున్నానయ్యా" అన్నాడు బాబూరావు.

"ఓసోస్! అట్టాగా... సరే బాగుపడు" అంటూ ఇంట్లో పాలేరుగా పెట్టుకున్నాడు.


ఓ రాత్రిపూట బాబూరావుని పిలిచాడు నాగభూషణం. విషయం వివరించాడు. చెయ్యనన్నాడు. కోపంతో మండిపడ్డాడు. చేయకపోతే తానే కేసుపెట్టి మళ్ళీ బయటకు రాకుండా చేస్తానని బెదిరించాడు. అతను అనేక వత్తిడులను తీసుకొచ్చాడు.

ఒప్పుకోక తప్పిందికాదు బాబూరావుకి. ఫలితంగా ఒక్క రాత్రిలోనే నాగభూషణం లక్ష సంపాదించాడు. బాబూరావు వాటా ఏమీ ఆశించలేదు.

తెల్లవారేసరికి బాబూరావుపై 'తన ఇంట్లో బంగారు నగలు కాజేశాడు' అని అక్రమంగా కేసు పెట్టాడు నాగభూషణం.

బాబూరావు నిజాన్ని పోలీసులకు చెప్పాడు. అయినా వాళ్ళు నమ్మలేదు. అసలు దొంగతనం చేసిన డబ్బు, నాగభూషణం బంగారు నగలు ఏమయ్యాయని పోలీసులు చితకబాదారు. వళ్ళంతా కుళ్ళబొడిచారు. మంచి మనిషిగా మారి బతుకుదామన్న అతని ఆశను నిలువునా దహించివేశారు.

దాంతో తను దొంగగానే బతకాలని బాబూరావు నిశ్చయించుకున్నాడు.



అతను చెప్పినదానిని విన్న నాకు మనుష లెంత స్వార్థపరులో అర్థమైంది. ఎదుటి మనిషి అసహాయతను ఆసరా చేసుకుని తమ అంతస్థులను ఎలా పెంచుకోవాలని తహతహ చెందుతారో అర్థమైంది.

ఇలా బాబూరావుగూర్చి ఆలోచిస్తున్న నాకు అతను కనిపించకపోవడం కాస్త బాధ కలిగిస్తోంది.

ఒకవేళ 'డ్యూటీ'లో పట్టుబడి జైలుకెళ్ళాడేమో? అన్న అనుమానం పీడించసాగింది. అతను ఎక్కడ వున్నా సురక్షితంగా వుండాలని నా మనసు పదేపదే కోరుకుంటోంది.

ఎన్నో రకాల పాత్రలను సృష్టించి ఎన్నో కథలు రాశాను. అవన్నీ నా ఊహాచిత్రాలే. అన్నీ కల్పనలే.

అయినా ఏదో వెలితి. అనుభవాల్ని రాసినవి అసలు లేవు. ఈసారి 'బాబూరావు' కథని తప్పనిసరిగా రాయాలని నిశ్చయించుకున్నాను.

పూర్తిగా తెలియని అతని జీవిత కథను తెలుసుకుని గొప్పగా రాయాలని నా మనసు ఆరాటపడుతోంది. ఇలాంటి స్థితిలో బాబూరావు కనిపించకపోవడం కాస్తంత ఆశాభంగాన్ని కలిగిస్తోంది.

బాబూరావుని గూర్చిన ఆలోచనలు ప్రవాహంలా సాగుతున్నాయి నాలో. మరో సంఘటన మెదిలింది.

తనను పెంచిన అతను చనిపోయిన తర్వాత బాబూరావు ఒంటరివాడైనాడు. ఎందరినో గుప్పెడు అన్నం పెట్టమని అడిగాడు. ఎందరికాళ్ళో పట్టుకుని ఏదన్నా పని ఇప్పించమని ప్రబతిమలాడాడు. అన్ని చోట్లా ఛీత్కారాలు, చీదరింపులే దక్కాయి

పస్తులతో అనేకరోజులు గడిపాడు. చివరికి దిక్కుతోచక రైల్లో వేరే చోటికి ప్రయాణమయ్యాడు. టిక్కెట్టు లేకపోవడంచేత పట్టుబడ్డాడు. పోలీసులచేత దెబ్బలు తిన్నాడు

ఇలాంటి స్థితిలో ఒక వేశ్య 'బాబూరావు'ని తన దగ్గర పనికి కుదుర్చుకుంది. విటులతో బేరంచేసి తీసుకెళ్ళేవాడు బాబూరావు.

ఆమె రాత్రిళ్ళు బేరానికి ఎక్కడికైనా వెళ్ళేటపుడు వెంట వెళ్ళేవాడు. ఓ ఐదు సంవత్సరాలు హాయిగా గడిపాడు. చివరకు ఆమె జబ్బున పడడంవలన మళ్ళీ బాబూరావు పరిస్థితి మొదటికొచ్చింది.

హోటల్‌లో పనికి కుదిరాడు. అది ఓ సంవత్సరంపాటు జరిగింది. వ్యాపారంలో నష్టంవచ్చి హోటల్‌ని మూసివేశారు.

పనికోసం ఊరంతా తిరిగాడు. చివరకు పాత పోలీస్ కానిస్టేబుల్ కనిపించాడు.

"ఏరా బాబుగా... మీ అయ్య చచ్చినాక కనపడవేలేదు. మా మామూళ్ళుకూడా ఇవ్వడంలేదు" అంటూ అడిగాడు.

"సంక్రాంతి రాబోతోంది... కనీసం రెండొందలన్నా ఇవ్వకపోతే బొక్కలో తోసి మక్కెలు విరగ్గొట్టిస్తా" నన్నాడు.

అలాంటి పనులు ఇప్పుడు చేయడంలేదని... తన పరిస్థితి అంతా వివరించాడు.

పోలీసు కానిస్టేబుల్ వినలేదు. 'దొంగ మాటలు చెబుతున్నావ్' అని బెదిరించి వెళ్ళిపోయాడు.

కడుపులో ఆకలి పరుగులెత్తసాగింది. ఎక్కడా పని దొరకలేదు. చివరకు ఏమి

చేయాలో తోచలేదు.

ఆకలికి తట్టుకోలేక ఓ ఇంట్లో దొంగతనం చేశాడు. ఓ ఏడొందలు దొరికాయి. కొన్నాళ్ళు హాయిగా జల్సా చేశాడు.

పోలీసులకి బక్షీలు ఇచ్చాడు.

'ఇదేరాజా అయిన మార్గమని... దీనిలో నువ్వు బాగా రాణిస్తావ్' అంటూ బాబూరావ్‌కి బాగా నూరిపోశారు. "నువ్వేం భయపడవద్దు. మేమున్నాం" అంటూ పోలీసులు అభయం ఇచ్చారు.

బాబూరావుని గూర్చి ఆలోచిస్తున్న నేను తలుపు కొట్టిన చప్పుడుకి ఆలోచనల్ని బ్రేక్ వేశాను.

కుర్చీలోంచి లేచి వెళ్ళి తలుపు తీశాను.

ఎదురుగా బాబూరావు. బాబూరావ్‌ని చూడగానే నాలో ఎక్కడలేని ఉత్సాహం ఉరకలు వేసింది.

"నమస్తే అయ్యగారు" అంటూ నవ్వుతూ పలకరించాడు.

లోపలికి రమ్మని చెప్పి తలుపు గడివేశాను. గోడకు ఆనుకుని చాపమీద కూర్చున్నాడు బాబూరావు.

పెరిగిన గడ్డం... వెరిసిన జుట్టు... వడలిపోయిన ముఖం... అయినా చెక్కుచెదరని చిరునవ్వు.

"ఏం బాబూరావు... ఈసారి పెద్దటూరేశావు. నువ్వు లేకపోయేసరికి ఏమీ తోచింది కాదు. ఆలోచనలన్నీ నీ చుట్టే తిరుగుతున్నాయి. ఒకవేళ 'డ్యూటీ'లో ఏమన్నా పట్టుబడ్డావేమోనన్న భయం..." నా ఉత్సుకతను తెలియజేశాను.

"చాలా సంతోషం బాబూ. జనం అందరూ ఛీ కొట్టినా నన్ను ఆదరిస్తున్న మిమ్మల్ని చూస్తుంటే దేవుడి కన్నా గొప్పగా కనిపిస్తున్నారు" కంటతడి పెట్టుకుని గద్గదకంఠంతో అన్నాడు బాబూరావు.

పాడులోకంపై మరోసారి కోపం వచ్చింది నాకు. ఏహ్యాభావం విస్తరించుకుంటుంది నాలో.

"అది సరేగాని బాబూరావ్! ఏఏ ఊళ్ళు వెళ్ళావ్ ఈసారి?" ప్రయాణపు విశేషాలను అడిగాను.

"పుట్టపర్తి వెళ్ళానుబాబూ. ఏ జనం



సైజు

రాజారావ్‌తో అన్నాడు గున్నేశ్వర రావ్—
"నాకు గిన్నీస్ బుక్‌లోకి ఎక్కాలని వుందండి!"
"అబ్బే! మీ జీవితంలో ఆ పని చేయలేరులెండి!"
"ఎందుకు?" ఉక్రోషంగా అడిగాడు.
"దాని సైజు మీ సైజుకంటే చిన్నదిగా?"

—టి. వెంకటప్రసాద్ రెడ్డి (హిందూపురం)

వత్తిడిబాబూ మన దేశమోళ్ళేకాక... పొరుగు దేశాలనుంచి చాలామంది వస్తున్నారుబాబూ. ఎంత డబ్బైనా భగవంతునికి ఇవ్వడానికి వెనుకాడరు. అదే ముష్టోడు పది పైసలు అడిగితే ఛీకొట్టి తరిమేస్తారు. కళ్ళముందు బాధపడుతున్న మనిషిని చూడకుండా చచ్చి స్వర్గానికి వెళ్ళాలనే తపనతో ఇప్పుడు దేవుడికి లంచాలు పంచిపెడుతుంటారు బాబూ.

పుట్టపర్తి 'డ్యూటీ' లాభసాటిగానే వుంది బాబూ. బాగానేస ంపాదించాను.

"డబ్బు కొట్టేటపుడు బాధనిపించదా బాబూరావ్?"

"ఎందుకు బాబూ బాధ. కష్టపడి పైసా సంపాదించినోడు వేలూ, లక్షలూ తీసుకొచ్చి విరాళం ఇవ్వడుబాబూ. అన్యాయంగా పదిలక్షలు సంపాదించి రెండు లక్షలు విరాళం ఇస్తారుబాబూ. మనం కొట్టినా అలాంటి బ్యాగ్‌లనే పడతాంబాబూ"

"ఊ... ఇంకా ఏవూరు వెళ్ళారు?"

"ఏదో సినిమా శతదినోత్సవమైతే మద్రాసులో ఫంక్షన్ చేస్తుంటే... మద్రాసులో కూడా డ్యూటీ ఎక్కాం బాబూ. ఫర్వాలేదు బాగానే దొరికింది. జనం ఎంత వెర్రోళ్ళు బాబూ"

"ఏం! అలా అంటున్నావ్."

"లేకపోతే డబ్బులు ఖర్చుపెట్టి సినిమా చూస్తున్నారు బాగానేవుంది. మళ్ళీ ఈ ఫంక్షన్‌లకు డబ్బులు ఖర్చుపెట్టి రావడం. వచ్చినవాళ్ళు ఊరుకుంటారా? అహో బాణాసంచా కాల్చడం... మనిషెత్తు దండలు తయారుచేయించి హీరోగారి మెడలో వేయడం... ఆయనగారికి బంగారపు ఉంగరం బహుమతి ఇవ్వడం ఏమిటిబాబూ ఈ పిచ్చి. హీరోగారికి ఏం తక్కువ. లక్షలు తీసుకుంటాడు. కావాలనుకుంటే బంగారపు ఇల్లునే కట్టించుకోగలడు. అంత డబ్బుగల హీరోగారికి వీళ్ళు బహుమతి ఇవ్వడం ఆ పిచ్చిని చూడాలేకానీ... చెబితే బాగోదు బాబుగారు"

"అవును బాబూరావు. నిజమే తల్లిదండ్రులు చదువుకోమని కాలేజీలకు పంపిస్తే వీళ్ళు చేసే ఘనకార్యాలు ఇవే"

"ఊ... ఇంకా ఏ ఊర్లు వెళ్ళారు?"

"మద్రాసులోనే ఇంకోసారి... మరుసటి రోజు ఏదో మంత్రిగారికి సన్మానమంటే అక్కడకూడా 'డ్యూటీ ఎక్కాం బాబూ. డ్యూటీ కాస్త కష్టం బాబూ. అయినా బాగానే చేశాం బాబూ.

అందుకనే ఈసారి కాస్త ఆలస్యం. మళ్ళీ రెండు నెలలదాకా డ్యూటీ ఎక్కే అవసరం లేదుబాబూ" అంటూ సంతోషంగా చెప్పాడు బాబూరావు.

'పోస్ట్' అన్న కేక విని బయటికి వచ్చాం. బాబూరావుకూడా నా అడ్రసుమీదే వుత్తరాలు రాస్తుంటాడు. మనీయార్డరు పంపించి నా నా అడ్రసే ఇస్తాడు.

మేము పంపిన మనీయార్డరు తిరిగొచ్చింది. అదిచూసి బాబూరావు కాస్త గాభరా పడ్డాడు.

"బాబూ నేను అర్జంటుగా ఊరెళ్ళున్నాను. మళ్ళీ రెండ్రోజుల్లో వస్తాను" అంటూ హడావుడిగా వెళ్ళిపోయాడు బాబూరావు..

విషయం ఏమీ అర్థంకాలేదు.

ప్రతిసారి రెండొందలు ఓ ఆడమనిషి

పేరుమీద పంపిస్తుంటాడు. ఎన్నిసార్లు అడిగాను ఆమె గురించి. ఒక్కమాటకూడా చెప్పలేదు.

ఆ అజ్ఞాతస్త్రీకోసం... నాలో ఎన్నో ప్రశ్నలు. "పెళ్ళి చేసుకున్నావా బాబూరావ్?" అంటే నవ్వి ఊరుకుంటాడు.

"భార్య చనిపోయిందా? కూతురికి పెళ్ళి చేశావా? ఆమెకేగా ఈ డబ్బులు" అని అడిగితే "సమయం వచ్చినపుడు అంతా వివరంగా చెబుతానుబాబూ... ఏమీ అనుకోవద్దు" అంటాడు.

రెండ్రోజుల తర్వాత ఊరినుంచి వచ్చాడు బాబూరావు. మనిషిలో చాలా మార్పు కన్పిస్తోంది. బాగా తాగాడు కాబోలు... సారా వాసన గుప్పున కొడుతోంది.

నన్ను చూడగానే భోరున ఏడ్చాడు.

నేను నిర్ఘాంతపోయాను. లుంగలు చుట్టుకుపోతూ ఏడుస్తున్న బాబూరావుని ఓదార్చుతూ 'అసలేం జరిగింది?' అని అడిగాను

బాబూరావు కంటతడిపెటుటకోవడం ఆగలేదు. ఊహించని ఈ సంఘటన నాలో నన్ని బాధను కలిగించింది.

"అయిపోయిందిబాబూ... అంతా అయిపోయింది. అందరూ నన్ను దగా చేశారు ..."

"ఏం జరిగింది బాబూరావు?"

"చెబుతా బాబు. సమయం వచ్చినపుడు అంతా చెబుతానని అన్నానుకదా బాబూ" అంటూ జరిగిన విషయాన్ని చెప్పసాగాడు.

"నేను బాగా వయసులో వున్నప్పుడు ఒక ఆడమనిషి పరిచయమయ్యిందిబాబూ. 'నువ్వంటే పంచప్రాణాలు. చచ్చేవరకు నీతోనే వుంటా' అంది బాబూ. అయినా నేనసలు పట్టించుకోలేదు.

నాకోసం అనేక ప్రయత్నాలు చేసింది. చివరకు చావడానికి కూడా సిద్ధపడింది బాబూ.

దానికి తల్లిదండ్రులు ఎవరూ లేరు. ఎక్కడ పుట్టిందో ఎలా పెరిగిందో తెలీదుబాబు.




# మోనాలిసా

*ప్రపంచంలో అత్యంత ప్రచారం పొందిన మ్యూజియం ప్యారిస్‌లోని లౌవ్రే మ్యూజియం! దానికి కారణం ఆ మ్యూజియంలో ఉన్న 'మోనాలిసా' చిత్రం కావచ్చు! ప్యారిస్ ఎవరు వెళ్ళినా 'మోనాలిసా' చిత్రం ఉన్న కార్డు కొనకుండా తిరిగిరారు! అంత ప్రాముఖ్యత ఉన్న ఆ చిత్రం ఖరీదు ఈ రోజున కనీసం 180 కోట్ల రూపాయలు వుంటుందంటే నమ్మగలరా? ఇది నిజంగా నిజమైన విషయం!*

—జూపిటర్

నాలా అనాథ అవడంవల్ల నాకోసం ఏమైనా చేయడానికి సిద్ధపడ్డ ఆ పిచ్చి ప్రేమకు కరిగిపోయానుబాబూ. పెళ్ళిచేసుకుని కాపురం పెట్టాను. రెండేళ్ళు బాగానే వుందిబాబూ. మాకో ఆడపిల్ల పుట్టిందిబాబు

ఎక్కువగా నేను 'డ్యూటీ'లకు వెళ్ళేవాడ్నిబాబూ.

'డ్యూటీ'కి వెళ్ళకుండా ఎప్పుడూ తన దగ్గరే వుండమని ఏడిపించేది బాబు.

నాకు చిరాకేసేది. గోల పడలేక 'డ్యూటీ'కి వెళ్ళి నెల, రెండు నెలలు ఇంటిముఖం చూసేవాడినేకాదు బాబూ.

దానికి డబ్బు పిచ్చి బాగా వుంది బాబు. తెచ్చిన సొమ్మంతా తనకిమ్మని గొడవ చేసేది. నాకు కోపం పెరిగిపోయేది.

కేవలం అది డబ్బుకోసమే నన్ను ప్రేమిస్తున్నట్టు నటిస్తుందేమో అనే అనుమానం నాకు కలిగేది.

ఒకసారి నేను లేనపుడు ఇంట్లో వున్న డబ్బును, పిల్లను తీసుకుని ఎటో వెళ్ళిపోయింది బాబు. అంతా వెతికాను ఎక్కడా జాడ తెలీలేదు. అప్పట్నుంచి ఆడవాళ్ళపై మనసు విరిగిపోయిందిబాబూ. చాలాకాలం ఒంటరిగానే గడిపాను బాబూ''

''చివరకు ఆమె కనిపించలేదా?''

''కనిపించిందిబాబు. వేరేచోట ఎవరితోనో కాపురం పెట్టింది. పిల్ల ఏది అని అడిగానుబాబు. తెలిసినవాళ్ళదగ్గర పెంచుతున్నానని చెప్పిందిబాబూ. ''ఎందుకు నన్నింత మోసం చేశావ''ని అడిగాను బాబూ.

''అది నా అలవాటు. డబ్బుకోసం నువ్వు దొంగతనాలు చేస్తున్నావు. అది నీ వృత్తి. డబ్బుకోసం నేనిలా మారుతుంటాను ఇది నా వృత్తి'' అంది బాబూ.

''పిల్లను నీలా పెంచొద్దు. దానిమీద నీ నీడకూడా పడడానికి వీల్లేదు. దానిని నేను తీసుకుపోతాను. ఎక్కడుందో చెప్పు'' అని బతిమలాడానుబాబూ.

అది రాక్షసిబాబు. చెప్పనంది బాబు. ఎన్నో విధాల ప్రాధేయపడ్డాను. ఒప్పుకోలేదు.

వెయ్యి రూపాయలిస్తే చూపిస్తానంది బాబూ. నా బిడ్డకోసం... దానిని చూడాలనే తపనతో ఇచ్చాను బాబు.

నన్ను ఒకచోట వుంచి ఎవరినో పంపించి పిలిపించింది బాబూ.

పెరిగి పెద్దదైంది. నన్ను గుర్తుపట్టలేదు బాబు నా బిడ్డ. నావైపు అదోలా చూస్తూ నిలబడింది.

''నేనమ్మా మీ నాన్నని'' అన్నాను. అయినా ఏ మార్పూ లేదు. నన్నుచూసి ''నాన్నా'' అని దగ్గరకు రాలేదు.

కొద్దిసేపు నిలబడి వెళ్ళిపోతుంటే పిలిచి బట్టలు కొనుక్కోమని కొంత డబ్బిచ్చానుబాబు.

''నెలనెలా రెండొందలు పంపిస్తుంటాను. కాదనకుండా తీసుకోమని'' చెప్పానుబాబు.

నావైపు అదోలా చూసి నవ్వుకుంటూ వెళ్ళిపోయింది బాబు.

''నా బిడ్డకు నా గురించి ఏం చెప్పావ్? ఎందుకని అది నన్ను 'నాన్నా' అని పిలవలేదు'' అని అడిగానుబాబూ.

"దొంగతనం చేసేవాడిగురించి ఏం చెప్పమంటారు. అయినా ఓసారి చెప్పాను. 'ఏంచేస్తుంటాడు? ఎక్కడున్నాడని' అడిగింది. మీ నాన్నకు ఒక ఊరని ఏముంది. దేశమంతా తిరుగుతుంటాడని చెప్పాను. దొంగతనం చేస్తుంటాడని చెప్పాను. నిన్ను తిట్టుకుంది'' అని చెప్పింది బాబూ. అప్పట్నుంచి పిల్లపేరుమీద నెలనెలా రెండొందలు పంపిస్తున్నానుబాబూ.

"నీతో రమ్మని మీ అమ్మాయిని అడగలేదా... బాబూరావ్''

"అడిగానయ్యా. నువ్వు దొంగవి. ఎప్పుడెక్కడ వుంటావో నీకే తెలీదు. నిన్ను నమ్ముకుని వుంటే మేం సుఖపడలేం. మా బ్రతుకు మేం బతకగలం. ఇంకెప్పుడూ మా దగ్గరకు రావద్దు'' అని మొహం మీద చెప్పిందయ్యా ఒకసారి.


అయినా ప్రేమ చంపుకోలేక అప్పుడప్పుడు వెళ్ళొస్తుంటాను. వెళ్ళినప్పుడు ప్రతిసారీ నన్ను తిట్టేది. మళ్ళీ రావద్దని గట్టిగా చెబుతుంది. రావనే చెబుతాను బాబు. పోకూడదనుకుంటాను. కానీ మనసు ఊరుకోదు బాబూ, బంధాన్ని సులభంగా వాళ్ళు తెంచుకోగలరేగానీ... నేను తెంచుకోలేకపోతున్నాను బాబూ'' అంటూ చారికలు కడుతున్న కన్నీటిని తుడుచుకుంటూ చెబుతున్నాడు బాబూరావ్.

"మరి మనియార్డరు తిరిగి రావడం... నువ్వు ఊరు వెళ్ళడం... ఏం జరిగింది?'' అని బాబూరావుని అడిగాడు.

"అదా... అయ్యా ఊరెళ్ళాను. నా పెళ్ళాన్ని అడిగాను ఎందుకు మనియార్డరు తిప్పిపంపారని. నాకేం తెలీదు. పిల్లే "వద్దు ఇకనుంచి నేను తీసుకోనని చెప్పింది'' అన్నది బాబూ.

"ఏం ఎందుకనీ'' అడిగాడు బాబూ.

"దానికేం ఖర్మ నీ ముష్టి రెండొందలు తీసుకోడానికి. అది ఇప్పుడు రాణి. ఒక్క రాత్రికే వెయ్యి రూపాయలు సంపాదిస్తుంది'' అన్నది బాబూ.




''అంటే... అమ్మాయి చేత...'' అని అడిగాడు బాబూ.

''అది ఇష్టపడింది చేస్తుంది. మాకు కావాల్సింది డబ్బు. దానికోసం ఏమైనా చేస్తాం'' అంది బాబూ నా పెళ్ళాం. చివరిసారిగా అమ్మాయిని చూపించమని అడిగాను బాబూ.

''అది... నువ్వు చచ్చిపోయావని అనుకుందని నీతో చెప్పమంది. ఇక నిన్ను చూడదంట...'' అని చెప్పింది బాబూ.

గోడకు చేరగిలబడి రోదిస్తున్న బాబూరావ్‌ని చూస్తుంటే నా గుండె కరిగిపోతోంది. అతని పరిస్థితి చూస్తుంటే నా దుఃఖం పెల్లుబికింది. దొంగకు కూడా ఓ కథ... కన్నీళ్ళూ ఉంటాయని ఎందరికి తెలుసు.

*



డిజైన్: దాసరి శారదాభూషణ్ (జగిత్యాల)